క్లుప్తంగా

ప్రయాణికులను గౌరవించాలి

మదనపల్లె సిటీ : ప్రయాణికులను గౌరవించాలని ఆర్టీసీ-1,2 డిపో మేనేజర్లు మూరే వెంకటరమణారెడ్డి, అమర్‌నాథ్ అన్నారు. మంగళవారం డిపో కార్యాలయాల్లో సిబ్బందితో గేట్ మీటింగ్ నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈనెల 15వతేదీ నుంచి స్త్రీశక్తి పథకం అమలు చేస్తున్నామని ఇందులో భాగంగా టిక్కెట్లు ఇచ్చు విధానం గురించి వివరించారు. ఎలాంటి ఫిర్యాదులు లేకుండా చూడాలన్నారు. జులై నెలలో ఈపీకె, కెఎంపిఎల్, ఓఆర్ తెలియజేశారు. అందరూ కలిసి సమష్టి పని చేసి ఆదాయం పెంచాలన్నారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు ఉచిత వైద్య శిబిరం

రామసముద్రం : రామసముద్రం పంచాయతీ శీతరగాని పల్లి గ్రామంలో మంగళవారం పశువైద్యాధికారి పావని ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సకాలంలో పశువులకు చికిత్స చేయించుకోవాలన్నారు. అనంతరం 175 పశువులకు బుటాక్ స్ప్రే,46 దూడలకు నట్టలనివారణ పిచికారీ, 29 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స, 19 పశువులకు ప్రథమ చికిత్స చేశారు. అలాగే ప్రస్తుతం పశువులకు వచ్చే ముద్ద చర్మవ్యాధి, సీజనల్ వ్యాధులపై సూచనలు ఇచ్చారు. జేఈఓ భాను ప్రకాష్, ఎల్ ఏ దత్తాత్రేయ, ఎహెచ్ ఎల్ రవి, నరేష్ పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరు, పీటీఎం పీహెచ్‌సీ పరిధుల్లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్య సిబ్బంది మంగళవారం విస్తృతంగా పర్యటించారు. డాక్టర్లు ఎండీ యస్దాని, శంకర్, బీఎస్ సాదియా, అభిలాష్‌ల ఆధ్వర్యంలో సిబ్బంది 1 నుంచి 19 ఏళ్ళ లోపు పిల్లలకు నులి పురుగుల నివారణ మాత్రలను మింగించారు. అనంతరం చేతుల పరిశుభ్రత, ఆహారపు అలవాట్లపై పిల్లలకు అవగాహన కల్పించారు.

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా టీఎల్ వెంకటేష్

పీలేరు : సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా టి.ఎల్. వెంకటేష్ రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నికయారు. మదనపల్లెలో జరిగిన సీపీఐ రెండో మహాసభల్లో భాగంగా ప్రతినిధుల సమావేశంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సీపీఐ కార్యదర్శిగా ఉన్న టిఎల్. వెంకటేష్ జిల్లా కమిటీలో సభ్యుడుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటాన్ని గుర్తించి రెండో సారి జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

పీలేరురూరల్ : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎన్ఎంయూ జిల్లా కార్యదర్శి పి.ఎస్.ఎం. రాజు అన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ గ్యారేజ్ ఎదుట రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ బస్సులను ఆర్టీసీ యాజమాన్యమే కొనుగోలు చేయాలని కోరారు. ఆర్టీసీ ఖాళీ జాగాలు ప్రయివేట్ పరం చేయరాదన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు వెంటనే భర్తీ చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ, డీఏ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వెంటనే చెల్లించాలన్నారు. ఆర్టీసీలో ఉన్న ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్ష, కార్యదర్శులు సి.వి. రమణ, ఆదినారాయణ, ఎన్ఎంయూ నాయకులు వి.పి. నాయుడు, పి. మధుసూదన్, బీఆర్‌బీ నాయక్, ఎం.హెచ్.నాయుడు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మోదీ రాజీనామా చేయాలి

మదనపల్లె రూరల్ : దొంగ ఓట్లతో గద్దెనెక్కిన మోదీ వెంటనే రాజీనామా చేసి గద్దె దిగిపోవాలని విడుదలై చిరుతైగల్ కట్చి(వీసీకేపార్టీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీయం.శివప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక బాస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాహుల్‌గాంధీ బయట పెట్టిన ఓట్ల దొంగతనం మీద సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జీల చేత విచారణ జరిపించాలని చెప్పారు. అంబేడ్కర్ పౌరులకు ఇచ్చిన ఓటుహక్కును బీజేపీ దుర్వినియోగం చేస్తోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీతో పాటు 300మందికి పైగా ఎంపీలు చేస్తున్న పోరాటానికి మద్దతు ప్రకటించారు. దొంగ ఓట్లను సృష్టించడంలో బీజేపీ, ఎలక్షన్ కమిషన్ ప్రమేయంపై అనుమానాలు ఉన్నాయని, ఓట్ల కుంభకోణంలో ఉన్న అధికారులను వెంటనే అరెస్ట్‌చేసి సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వీసీకే పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముత్యాలమోహన్, భారతీయ అంబేడ్కర్ సేన నాయకులు జి.గంగులప్ప, వై.గంగాధర్, సయ్యద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 61 మంది ఎంపిక

పీలేరు రూరల్ : స్థానిక సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలలో 61 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మరియు సీడ్ ఆఫ్ అండ్ డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ సంయుక్తంగా నిర్వహించిన జాబ్ మేళాలలో 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూ చేశారు. మొత్తం 120 మంది హాజరు కాగా అందులో 61 మంది సెలెక్ట్ అయినట్లు తెలిపారు.

ప్రజా సమస్యలపై స్పందించండి

- తహసీల్దార్ కార్యాలయం తనిఖీ చేసిన సబ్‌కలెక్టర్
- పీహెచ్‌సీలో వైద్య సేవలపై ఆరా
- మోడల్ పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటింపు



పెద్దమండ్యం : మోడల్‌స్కూల్ విద్యార్థులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

పెద్దమండ్యం : అధికారులు ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై స్పందించాలని మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి సూచించారు. మంగళవారం పెద్దమండ్యం తహసీల్దార్ కార్యాలయాన్ని మదనపల్లె సబ్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. భూముల సమస్యల పరిష్కారానికి సిబ్బంది కృషి చేయాలన్నారు. రోజువారీగా రైతుల నుండి వస్తున్న ఫిర్యాదులు వాటి పరిష్కారంపై ఆరా తీశారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సబ్ కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆమె వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో విధుల్లో ఉన్న వైద్యులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆందుకు సంబంధించిన హాజరు పట్టికలను పరిశీలించారు. మందుల స్టాక్ పరిశీలించి, ఏయే మందులు అందుబాటులో ఉన్నాయనే విషయమై ఆరా తీశారు. అలాగే రోజువారీ ఓపీ కేసులు, అందిస్తున్న చికిత్సలు అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ, మలేరియా, జ్వరాల కేసులు, ఎక్కడైనా ఉంటే వాటి నివారణ కోసం తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో ప్రసవాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మోడల్ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుల సంఖ్య, హాజరు, అలాగే విద్యార్థుల సంఖ్య, హాజరుపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి వారి విద్యా సామర్థ్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ తేజస్విని, మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ రామాంజులు నాయక్, డీటీ రాజేష్, ఆర్ఐ భరత్‌రెడ్డి, వీఆర్‌వోలు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

తంబళ్లపల్లె : గ్రామీణ ప్రజలకు వైద్యులు మెరుగైన వైద్యసేవలు అందించాలని మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. మెటర్నటీ వార్డు, ఇన్‌పేషంట్ల వార్డు, ఫార్మసిస్టు గది, ఇంజెక్షన్ ఇచ్చే గదులను పరిశీలించారు. రోజు ఓపి పేషంట్లు, వివరాలు,డాక్టర్లు, వైద్య సిబ్బంది పనితీరు తదితర అంశాలపై డాక్టర్ అమరసింహరాజును అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు అందుబాటులో ఉండి సకాలంలో వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీఓ థామస్, డీటీ నవీన్, ఎంఈఓ త్యాగరాజు, హెడ్ సిస్టర్ గ్లోరీలిటిల్‌ఫ్లవర్, ఆర్ఐ ముద్దుకృష్ణ, వీఆర్ఓ నాగరాజు తదితరులు ఉన్నారు.

మాతా శిశుసంరక్షణకు కృషి చేయండి

- రాష్ట్ర అదనపు సంచాలకులు అనిల్ కుమార్
- పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



అమ్మచెరువుమిట్ట యూపీహెచ్‌సీలో సిబ్బందిని వివరాలు తెలుసుకుంటున్న అనిల్ కుమార్

మదనపల్లె రూరల్ : మాతా శిశు సంరక్షణకై వైద్య ఆరోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో మరింతగా కృషి చేయాలని రాష్ట్ర అదనపు సంచాలకులు అనిల్ కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని అమ్మ చెరువు మిట్ట లో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మెడికల్ ఆఫీసర్, స్థానిక సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఆరోగ్య చికిత్సలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై సిబ్బందికి సూచనలు చేశారు. మాతా శిశు సంరక్షణకై అవసరమైన మందులు యూపీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నాయా? అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గైనిక్ సమస్యలపై వచ్చే రోగులను స్క్రీనింగ్ చేస్తున్న విధానం, గర్భిణులు, కాన్పులు తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కచ్చితంగా ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే జరిగేలా వైద్య ఆరోగ్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఆస్పత్రి ఓపిక వచ్చే రోగులకు తప్పనిసరిగా వైద్య పరీక్షల్లో భాగంగా ఈ హెచ్ ఆర్ చేయించాలన్నారు. కుటుంబ సంక్షేమంలో భాగంగా అర్హులైన దంపతులు బిడ్డకు బిడ్డకు మధ్య ఎడం పాటించేలా సిబ్బంది అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డి ఎం అండ్ హెచ్ ఓ రమేష్ బాబు, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్,104 జిల్లా నోడల్‌ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్, యు పి హెచ్ సి వైద్యులు భార్గవి, హరికృష్ణ, ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

కలకడ సీఐగా బి.లక్ష్మన్న



కలకడ : కలకడ సర్కిల్ కార్యాలయం సీఐగా బి.లక్ష్మన్న మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ గురునాథ్ ఇటీవల బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో మొలకలచెరువు సీఐగా వున్న బి.లక్ష్మన్నను బదిలీ చేయడంతో ఆయన విధులలో చేరారు. ఎస్ఐ రామాంజినేయులు, పోలీసు సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియచేశారు.

ఫుట్‌బాల్ పోటీలకు ముగ్గురు బాలికలు ఎంపిక



స్నేహలత



నేహా



గానవి

మదనపల్లె సిటీ : మదనపల్లెకు చెందిన ముగ్గురు విద్యార్థులు సబ్ జూనియర్ నేషనల్ ఫుట్‌బాల్ బాలికల పోటీలకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్‌కుమార్, మురళీధర్ తెలిపారు. ఈనెల 4,5 తేదీల్లో స్థానిక వేదపాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో మదనపల్లెకు చెందిన గానవి, నేహా, స్నేహలత ప్రతిభ కనబరిచారు. వీరు ఈనెల 25వ తేదీన ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్‌లో జరిగే నేషనల్ పోటీల్లో పాల్గొంటారు. జిల్లా నుంచి మెట్టమొదటిసారిగా ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలి



ప్రొఫెసర్ నరసింహమూర్తి

మదనపల్లె సిటీ : ఇంజనీరింగ్ విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని బెంగళూరు ప్రెసిడెన్సీ యూనివర్సిటీ ఇంగ్లీషు విభాగం ప్రొఫెసర్ ఎస్.నరసింహమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో ఇండక్షన్ కార్యక్రమంలో భాగంగా 'యువర్ వాయిస్-యువర్ పవర్' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు సమర్థవంతమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాల ప్రాముఖ్యతలను వివరించారు. కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆలోచనలను ధైర్యంగా వ్యక్తపరచడం, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం, బృందస్ఫూర్తితో పనిచేయడం ద్వారా జీవితంలో ఉన్నత స్థానాలకు సాధించగలమన్నారు. పోటీ ప్రపంచంలో విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, ఆత్మ విశ్వాసం, భాషా పటిమను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపా4ల్ పి.రాయుడు, అధ్యాపకులు అమరనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మృతికి సంతాపం

కలికిరి : శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తాటిపర్తి చెంచురెడ్డి(91) మృతికి పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సంతాపం తెలిపారు. చెంచురెడ్డి మృతి సమాచారంతో మంగళవారం ఉదయం మాజీ ఎమ్మెల్యే భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శ్రీకృష్ణ ఆలయ కమిటీ సభ్యులు

మదనపల్లె సిటీ : స్థానిక అమ్మచెరువుమిట్టవద్దనున్న గోవర్ధగిరిలో వెలసిన శ్రీకృష్ణ ఆలయంలో ఈనెల 16వతేదీన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు శ్రీకృష్ణ ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం స్థానిక ఆలయం వద్ద కృష్ణమి వేడుకల పోస్టర్లను ఆవిష్కరించారు. ఉదయం శ్రీరుక్మిణీ,సత్యభామ సమేత శ్రీకృష్ణుడుడికి అభిషేకాలు, అర్చన కార్యక్రమాలు, స్వామి దర్శనం ఉంటుందన్నారు. 10 గంటలకు కళ్యాణోత్సవం, 12 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరుగుతాయన్నారు. సాయంత్రం స్నపనోత్సవం, వసంతోత్సవం, ఉట్టి కొట్టే కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు,ప్రసాదాలు తీసుకోవాలన్నారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మత్తు జీవితాన్ని నాశనం చేస్తుంది

బి.కొత్తకోట : మత్తు పదార్థాలు జీవితాన్ని నాశనం చేస్తాయని, ప్రతి విద్యార్థి జాగ్రత్తలు పాటించడం అవసరమని స్థానిక సీఐ కే.గోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాల్సిన విద్యార్థులు అలవాట్లకు బలహీతపడితే భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని సాధించాలని, దీని కోసం తపన, క్రమశిక్షణతో కూడిన శ్రమ అవసరమని వివరించారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి

పీలేరు రూరల్ : వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పీలేరు పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సర్పంచ్ హబీబ్‌బాషా అన్నారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. మాజీ సర్పంచ్ హుమయూన్, ఆయన సోదరుడు షాజహాన్‌ల చిత్ర పటాలకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో పైపులైన్ల మరమ్మతు పనులు, గేటువాల్వుల రిపేర్లు చేపట్టి తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈవో లతీఫ్‌ఖాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నౌషాద్, వార్డు మెంబర్లు ఉదయ్‌కుమార్, సాంబశివారెడ్డి, కాలేషా, అబీద్ పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధితులపై వివక్ష చూపరాదు

మదనపల్లె రూరల్ : హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపరాదని, ఇందు కోసం ప్రజలకు అవగాహన కల్పించడానికి మీకు తెలుసా? కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా అదనపు వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా ఆస్పత్రిలో ఇండియా ఫైట్స్ హెచ్ఐవీ అండ్ ఎస్టీఐ అనే థీమ్‌తో హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమంలో భాగంగా మీకు తెలుసా? పోస్టర్లను ఆవిష్కరించారు. ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ అవగాహన కార్యక్రమంలో రెండు నెలల పాటు పట్టణంలోని మురికివాడలు, మార్కెట్లు, హాట్ స్పాట్స్, గ్రామీణ ప్రాంతాలు, కాలేజీలలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటేశ్వరి, ఐసీటీసీ కౌన్సిలర్లు జయకుమార్,పుల్లయ్యనాయుడు, దీప్తి, హారతి,ఆర్ఆర్ఎస్ పీఓ పురుషోత్తం, జనచేతన పీఓ ఓబులేసు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


హెచ్ఐవీ నివారణపై అవగాహన

తంబళ్లపల్లె : హెచ్ఐవీ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ థామస్‌రాజా అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీటీసీ, కృషి సంస్థ సంయుక్తంగా ఇండియా ఫైట్స్ హెచ్ఐవీ అండ్ ఎస్టీఐ అనే థీమ్‌తో హెచ్ఐవీ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. తంబళ్లపల్లె మారుమూల గ్రామాల్లో హెచ్‌వీఐపై వివరించాలని సూచించారు. ఐసిటీసీ కౌన్సిలర్ ఎం.చంద్రమోహన్, ఎల్‌టీ బాలాజీ, కృషి సంస్థ పీఓ శ్రీనివాసులు, ఓఆర్‌డబ్ల్యులు సావిత్రి, పల్లవి, పీఈ శోభ, వెలుగు సీసీలు రమణ, నరసింహులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

మదనపల్లె రూరల్: బైక్ ఢీకొని మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం మదనపల్లెలో జరిగింది. గాలివీడు మండలం పందిగాని తాండాకు చెందిన బద్దె నాయక్, పుష్పవతి (43), దంపతులు మదనపల్లె పట్టణంలోని అన్నమయ్య సర్కిల్ రింగ్ రోడ్డు వద్ద, నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లో కాపలా పనులు చేస్తుంటారు. మంగళవారం మధ్యాహ్నం పుష్పవతి రోడ్డు దాటుతుండగా, అటువైపు నుంచి పట్టణంలోని గొల్లపల్లి సర్కిల్ కు చెందిన వెంకటేష్ కుమారుడు చిరంజీవి (34) బైక్ పై వేగంగా వచ్చి ఢీకొన్నాడు. ప్రమాదంలో పుష్పవతి తలకు తీవ్ర గాయం కాగా కుడికాలు విరిగింది. చిరంజీవి సైతం చేయి విరిగి తీవ్రంగా గాయపడ్డాడు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులతో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పీలేరురూరల్ : చిత్తూరు జిల్లా కల్లూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు డి.ఎస్. ప్రభాకర్‌రెడ్డి కుమారుడు చైతన్యరామ్‌కు వైఎస్సార్ కడప జిల్లా యర్రగుంట్లకు చెందిన వెంకటరామిరెడ్డి కుమార్తె ప్రియాంకతో స్థానిక ఎంఎం ఫంక్షన్ హాల్‌లో వివాహం జరిగింది. ఈ వివాహానికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, చిచ్చిలి పురుషోత్తంరెడ్డి, సర్పంచ్ హబీబ్‌బాషా, నాయకులు డి.ఎస్. గోవింద్‌రెడ్డి, ఉదయ్, నాగభూషణం, అబీద్, షాకీర్, మునీర్, రియాజ్, దావూద్, పి. ద్వారకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులకు లంచాలు డిమాండ్

గుర్రంకొండ : తమ గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పనులు, గోకులం షెడ్ల నిర్మాణాల బిల్లులకు సంబంధించి ఉపాధి హామీ సిబ్బంది లంచాలు వసూలు చేశారంటూ సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు మహాత్మారెడ్డి సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పీ తిరుమలేష్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయానికి వెళ్లి లిఖిత పూర్వకంగా ఆయనకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఏడాదికి గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందం గత నెల 28వ తేదీ నుంచి తనిఖీలు నిర్వహించారన్నారు. కస్పాలో సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించాల్సి ఉండగా మారుముల గ్రామమైన బురుజుపల్లెలో డీఆర్పీ, టీఏ, ఫీల్డ్‌అసిస్టెంట్లు నిర్వహించారన్నారు. టి.రాచపల్లెలో గ్రామసభ జరిగితే వీరు చేసిన అవినీతి బయటపడుతుందోనని భయపడి ఇక్కడ సభ నిర్వహించలేదన్నారు. తన భార్య శ్రీదేవి పేరిట గతంలో గోకులం షెడ్డు మంజూరైందన్నారు. వీటి నిర్మాణాలకు సంబంధించి బిల్లులు చేయాలంటే తనకు రూ. 20 వేలు లంచం ఇవ్వాలంటూ టెక్నికల్ అసిస్టెంట్ డిమాండ్ చేశారన్నారు. ఈ విషయమై పూర్తి స్థాయిలో విచారణ జరిపి టీఏపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థుల హక్కులను కాలరాస్తున్న

జీవోలు రద్దు చేయాలి

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మదనపల్లె సిటీ : విద్యార్థుల హక్కులను కాలరాస్తున్న జీవోలను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు కృష్ణప్ప, మహేష్ అన్నారు. మంగళవారం స్థానిక బీటీ కాలేజీ వద్ద ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సం పురస్కరించుకుని పతాక ఆవిష్కరణ చేశారు. విద్యార్థుల సమస్యల కోసం ఏఐఎస్ఎఫ్ నిరంత పోరాటాలు చేస్తున్నట్లు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం విద్యార్థుల హక్కులు కాలరాస్తే జీఓలు ఇస్తున్నారని వీటి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం పథకంలో చాలా మందికి షరత్తులు పెట్టి అందించలేదన్నారు. ప్రభుత్వ ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ హాస్టల్స్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు,కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు అవుతున్నా ఇప్పటి వరకు డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించకపోవడం దారుణమని మండిపడ్డారు. యువగళం పాదయాత్రలో పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే జీఓ నంబరు 77 రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. వైద్య, విద్యను ప్రైవేటీకరన చేయకుండా జీవో నంబర్ 107,108 రద్దు చేస్తామన ఇచ్చిన హామీనీ కూడా నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేష్, జిల్లా గర్ల్స్ కన్వీనర్ గంగారాణి, భవిత, సాయికిరణ్ విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

స్వమిత్వ పథకంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డీఎల్‌డీఓ అమరనాథ్

మదనపల్లె రూరల్ : గ్రామ కంఠాల్లోని ఇండ్లు, ఖాళీస్థలాలపై ప్రజలకు యాజమాన్య హక్కులు కల్పించే స్వమిత్వ పథకంపై అవగాహన పెంచుకోవాలని డీఎల్‌డీఓ అమరనాథ్, డీఎల్‌పీఓ నాగరాజులు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గ్రామ సచివాలయ సిబ్బందికి స్వమిత్ర పథకంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఎల్‌డీఓ అమరనాథ్ మాట్లాడుతూ... స్వామిత్వ పథకంలో అత్యాధునిక డ్రోన్ టెక్నాలజీ ద్వారా సర్వే చేయడం జరుగుతుందన్నారు. స్వమిత్వ(గ్రామాల సర్వే, గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సాంకేతికతో మ్యాపింగ్) సర్వే ద్వారా ప్రజలకు స్పష్టమైన యాజమాన్య రికార్డులతో పాటు కచ్చితమైన ఆస్తి యాజమాన్య డేటాను అందించడం జరుగుతుందన్నారు. డ్రోన్లు, జీఐఎస్ సాంకేతికతను ఉపయోగించి గ్రామీణ ప్రాంతాల్లోని భూయజమానులకు హక్కుల రికార్డులను అందించడం, భూరికార్డులను డిజిటల్ పద్ధతిలో తయారుచేయడమే స్వమిత్ర పథకం ప్రధాన ఉద్దేశమన్నారు.

భయపెట్టడం కంటే బంధాలు గొప్పవి



యూనివర్సిటీలో యాంటి ర్యాగింగ్‌డే

కురబలకోట : విద్యార్థి జీవితంలో కళాశాల అనుభవాలు మరుపురానివని కలలు, ఆశలతో అడుగుపెట్టే విద్యార్థులను ర్యాగింగ్ పేరుతో భయపెట్టడం సరికాదని అంగళ్లు డీమ్డ్ యూనివర్సిటీ ప్రతినిధి డాక్టర్ ఆర్. కల్పన అన్నారు. మంగళవారం యాంటి ర్యాగింగ్‌డేని పురస్కరించుకుని జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గతంలో ర్యాగింగ్ అంటే వణుకుపుట్టేదన్నారు. ఇదొక మానసిక హింస అన్నారు. కానీ ఇప్పుడు కాలం మారిందన్నారు. ర్యాగింగ్ నిరోధానికి యుజీసీ, ఏఐసీటీఈ లాంటి సంస్థలు పలు రెగ్యులేషన్స్ తీసుకువచ్చాయన్నారు. మరో వైపు విద్యా సంస్థలు కూడా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడంతో సత్ఫలితాలు వచ్చాయన్నారు. భయపెట్టడం కన్నా బంధాలు గొప్పవన్న విషయాన్ని సీనియర్లు గుర్తించాలన్నారు. జూనియర్లను స్నేహ పూర్వకంగా ఆహ్వానిస్తే సీనియర్ల విలువ పెరగడంతో పాటు మార్గదర్శకులుగా నిలుస్తారన్నారు. తద్వారా సీనియర్లను జీవితాంతం గుర్తుంచుకుంటారన్నారు.

బీటీ కళాశాలపై సమగ్ర విచారణకు డిమాండ్

మదనపల్లె : స్థానిక బీటీ కళాశాలలో జరుగుతున్న విషయాలపై లోతైన విచారణ చేపట్టి నిజాల నిగ్గుతేల్చాలని రాష్ట్ర విద్యార్థి జేఏసీ కార్యదర్శి వి.ఉత్తన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఉన్నత విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ కృష్ణ కలిశారు. కళాశాలలో నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ తొమ్మిది అంశాలపై విచారణకు ఆదేశించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజులు, కళాశాలకు మంజూరైన నిధులు, ఎన్ని బ్యాంకు ఖాతాలు నిర్వహిస్తున్నారు, వాటి వినియోగం తదితర అంశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు టి.రాజా, రాష్ట్ర కమిటి సభ్యులు సురేష్, శ్రావణ్, సుధీర్, శివ పాల్గొన్నారు.